ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

భద్రాద్రి కొత్తగూడెం


BHADRADRI KOTHAGUDEM

మంగళవారం, 6 ఆగస్టు 2024





ఉదయం : 8.00 గంటలు...



ఉదయం : 8.01 గంటలు...



ఉదయం : 8.02 గంటలు...

జ్ఞాపకాల జలధిలో..

కాలగర్భంలోకి కొండగుర్తులు

- పాల్వంచ కేటీపీఎస్‌లో 8 కూలింగ్ టవర్ల నేలమట్టం
- ఇంప్లోజన్ టెక్నాలజీతో క్షణాల్లో కూల్చివేసిన ఇంజనీర్లు
- కూల్చివేసినందుకు ఎక్స్‌క్యూడ్ సంస్థకు రూ.2కోట్ల చెల్లింపు
- 1966లో నిర్మాణం... విద్యుత్ ఉత్పత్తిలో కీలకపాత్ర
- చివరిదశకు చేరిన పాత ప్లాంట్ కూల్చివేత పనులు

పాల్వంచ కేటీపీఎస్.. ఈ పేరు రెండు తెలుగు రాష్ట్రాలకే కాదు, భారతదేశానికి అంతటికీ సుపరిచితం. బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రంగా దాదాపు ఆరు దశాబ్దాలపాటు ఈ కేంద్రం విద్యుత్ వెలుగులను పంచింది. వేలాదిమంది ఇంజనీర్ల ప్రతిభకు కొలమానంగా నిలిచింది. పారిశ్రామిక ప్రగతిలో తనవంతు పాత్ర నిర్వర్తించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు, నేడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కొండగుర్తుగా నిలిచిన ఈ కేంద్రానికి కాలం చెల్లడంతో గతేడాది నుంచి కూల్చివేస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలో కేటీపీఎస్‌కు తలమానికంగా పేరుపొందిన 8 భారీ కూలింగ్ టవర్లను సోమవారం ఇంప్లోజన్ టెక్నాలజీ ద్వారా క్షణాల్లో నేలమట్టం చేశారు. దీంతో దశాబ్దాల నాటి గుర్తులు తెరమరుగై పోయినట్లయింది. 6 - పాల్వంచ

ప్రత్యేక పాలనకు రంగం సిద్ధం

- నేటితో ముగియనున్న జడ్పీ పాలన
- నేడు ప్రత్యేక సమావేశం

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 5: మండల, జిల్లా పరిషత్తు ప్రాదేశిక నియోజకవర్గాల్లోనూ ప్రత్యేకాధికారుల పాలనకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎంపీపీలు, జడ్పీ ఛైర్మన్ల పదవీకాలం నేటితో (ఆగస్టు 6) ముగియనుంది. వీరి స్థానంలో ప్రత్యేకాధికారులు పాలన బాధ్యతలు చేపట్టనున్నారు. జిల్లా పరిషత్తులకు కలెక్టర్, మండల పరిషత్తులకు జిల్లా స్థాయి అధికారులను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు రానున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని మండల, జిల్లా పరిషత్తు ప్రాదేశిక నియోజకవర్గాల్లోనూ నేటి నుంచి ప్రత్యేక అధికారుల పరిపాలన కొనసాగనుంది. 2019 మే నెలలో ఉభయ జిల్లాల్లోని ఎంపీటీసీ, జడ్పీటీసీల ఎన్నికలు జరిగాయి. అదే ఏడాది ఆగస్టు 6న మండల పరిషత్తులకు పాలకవర్గాలు ఏర్పడ్డాయి. అధ్యక్ష ఉపాధ్యక్షులతోపాటు సభ్యులు ప్రమాణం చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో జడ్పీ ఛైర్మన్లు, ఉపాధ్యక్షులు, సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఆగస్టు 7న జరిగింది. దీని ప్రకారం ఆగస్టు 6తో పాలకవర్గాల గడువు తీరనున్న నేపథ్యంలో ఇక నుంచి మండల, జిల్లా పరిషత్తుల బాధ్యతలను ప్రత్యేకాధికారులు స్వీకరిస్తారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పదవీకాలం నేటితో పూర్తి కానుండటంతో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిపే పరిస్థితి లేదు. అందుకే ప్రత్యేకాధికారుల పాలన వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సెప్టెంబరులో జిల్లాలో గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించిన తర్వాత స్థానిక సంస్థలకు కూడా నిర్వహించే ఆస్కారం ఉందని తెలుస్తోంది.

నేడు ప్రత్యేక సమావేశం

ఖమ్మం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నేడు జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో వినోద్ తెలిపారు. పలు అంశాలపై చర్చ అనంతరం జడ్పీటీసీ సభ్యులకు, ఎంపీపీలకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు హాజరు కావాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

	ఖమ్మం జిల్లా	భద్రాద్రి జిల్లా
జడ్పీటీసీలు	20	21
ఎంపీటీసీలు	289	220



మాట్లాడుతున్న కార్పొరేటర్



ఖమ్మం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న మంత్రి తుమ్మల, మేయర్ నీరజ

'ఖమ్మం సూపర్' అనేలా తీర్చిదిద్దాలి...

అధికారులు, కార్పొరేటర్లు సమష్టిగా కృషి చేయాలి

- టీయూఎఫ్ఐడీసీ కింద రూ.100 కోట్లతో పనులు
- స్థలాల పూర్వాపరాలు పరిశీలించాకే నిర్మాణాలకు అనుమతులివ్వండి..
- పారిశుధ్య నిర్వహణను పాత ఏజెన్సీకి ఎలా అప్పగిస్తారు?
- నగరంలో కోతులు, కుక్కల బెడదను తగ్గించేలా చర్యలు తీసుకోవాలి
- ఖమ్మం నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో మంత్రి తుమ్మల

ఖమ్మం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం పరిశుభ్రతతో ఉండి, మరింత అభివృద్ధి జరిగేలా చూడాలని, 'ఖమ్మం బాగుంది..' అని అనుకునేలా కార్పొరేటర్లు, అధికారులు సమష్టి బాధ్యత తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఖమ్మం నగరపాలక కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్‌లో ఆమోదించేందుకు ప్రవేశపెట్టిన పలు తీర్మానాలపై ఆయన చర్చించి, పలు అంశాలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. టీయూఎఫ్ఐడీసీ కింది మంజూరైన రూ.100 కోట్ల నిధులకు సంబంధించి ఖమ్మం నగరం నలుమూలల అభివృద్ధి జరిగేలా అందరికీ ఉపయోగపడేలా కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందించాలన్నారు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి అనుమతులు ఇచ్చే సమయంలో భూముల పూర్వాపరాలు పరిశీలించాలన్నారు. దరఖాస్తులు వచ్చిన స్థలాలకు సంబంధించి లింకు డాక్యుమెంట్లు పరిశీలించాలని, ఆ భూములు సంబంధిత దరఖాస్తుదారులకు ఎలా వచ్చాయి, డాక్యుమెంట్లలో ఉన్న సర్వే నెంబర్లు, స్థలంలో ఉన్న సర్వే నెంబర్లు ఒకేవిధంగా ఉన్నాయా? వంటి పలు అంశాలను రెవెన్యూ అధికారుల ద్వారా ధ్రువీకరించుకున్న తర్వాత మాత్రమే అర్జీలకు ఆమోదం తెలపాలని సూచించారు.

పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని తెలిసినప్పటికీ మళ్లీ అదే ఏజెన్సీకి ఎలా అప్పగిస్తారని, టెండర్ల గడువు ముగిసే వరకు ఏమి చేస్తున్నారని ఆయన అధికారులను ప్రశ్నించారు. ఖాళీ ప్లాట్ల పరిశుభ్రత, డివిజన్లలో అంతర్గత రహదారుల ఆక్రమణల వంటి అంశాలకు సంబంధించి ప్రత్యేకంగా సమయం కేటాయించుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. దానితోపాటుగా గతంకంటే కొంతమేర మెరుగుపడిందని, దానిని అలాగే కొనసాగించాలన్నారు. వర్షాకాలం కొనసాగుతున్న తరుణంలో దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేలా ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలన్నారు. కుక్కలు, కోతుల బెడదను తగ్గించేందుకు కావాల్సిన చర్యలు చేపట్టాలన్నారు.

కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ వీధిలైట్లకు సంబంధించి ప్రత్యేకంగా టెండర్లకు పిలవడం జరుగుతోందని, నగరంలో వీధిలైట్ల సమస్య మరో 15 రోజుల్లో తొలగిపోతుందన్నారు. కుక్కలు, కోతులను నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పారిశుధ్యం విషయంలో యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామన్నారు. పారిశుధ్య కార్మికులకు హెల్త్ ఇన్సూరెన్స్‌పై వచ్చే కౌన్సిల్ సమావేశానికల్లా ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

పలు తీర్మానాలకు ఆమోదం..

పెవిలియన్ మైదానం అద్దె గతంలో రూ.10 వేలు ఉండగా.. దాన్ని రూ.15 వేలకు పెంచుతూ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లను ఏడాది పాటు అవుట్‌సోర్సింగ్ (మిగతా 7వ పేజీలో)

డంపింగ్ సమస్యకు చెక్

కమిషనర్ అగస్త్యతో సమావేశమైన ముంబై బృందం 6

ఇండస్ట్రియల్ పార్క్ దశాబ్దాల కల

- మధిరలో ఈ ప్రాజెక్ట్ రాష్ట్రానికి రోల్‌మోడల్‌గా నిలవాలి
- ఇక్కడ పరిశ్రమలు పెట్టేవారికి బ్యాంక్ రుణాలిప్పిస్తాం
- స్థలాల కేటాయింపులో రిజర్వేషన్లు పాటిస్తాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- యండపల్లిలో ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన



6

15న 'సీతారామ' ప్రారంభం

- సీఎం చేతుల మీదుగా పంప్‌హౌస్‌లు ప్రజలకు అంకితం
- వైరాలో లక్షమందితో బహిరంగ సభ : మంత్రి తుమ్మల



పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

సమస్యలు పరిష్కరించాలి

- యూనివర్సిటీ ఏర్పాటును విస్మరించిన ముగ్గురు మంత్రులు
- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి
- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థుల భారీ ప్రదర్శన 6



ప్రగతి పథం..

అభివృద్ధిపై నజర్

- అసెంబ్లీ సమావేశాలు ముగియడంతో జిల్లాపై మంత్రుల దృష్టి
- నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటనలు
- పలు అభివృద్ధి పనులకు ప్రణాళికలు
- 15న సీఎం పర్యటనకు ఏర్పాట్లు

ఖమ్మం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అసెంబ్లీ సమావేశాలు ముగియడంతో అభివృద్ధి పనులపై మంత్రులు దృష్టిసారించారు. ఒకవైపు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల మంజూరు, శంకుస్థాపనలు చేస్తూనే మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనపై దృష్టి సారించారు. దాంతో అధికార యంత్రాంగంలోనూ హడావిడి మొదలైంది. అసెంబ్లీ సమావేశాల అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంటనే మధిర నియోజకవర్గంలో పర్యటించారు. చింతకాని మండలంలో దళితబంధు సమీక్ష, మధిర, ముదిగొండ మండలాల్లో పలు రహదారులకు శంకుస్థాపనలు నిర్వహించగా.. సోమవారం మధిరరూరల్ మండలంలో ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులతో తన నియోజకవర్గంపై భట్టి విక్రమార్క దృష్టి పెట్టారు. నియోజకవర్గానికి అవసరమైన సాగు, తాగునీరు, రహదారులతోపాటు పరిశ్రమల ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారు. క్యాబినెట్‌లో డిప్యూటీ సీఎం హోదాతో కీలకమైన ఆర్థిక, విద్యుత్‌శాఖలు కూడా భట్టి వద్దే ఉండడంతో ఆయన అనుకున్న పనులు మంజూరు చేస్తూ నియోజకవర్గంలో అభివృద్ధిని వేగవంతం చేశారు. ఇక మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా తన నియోజకవర్గమైన ఖమ్మంతోపాటు జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి పనులపై దృష్టి సారించారు. ముఖ్యంగా గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో సీతారామ ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేయించారు. నిరంతరం పర్యవేక్షిస్తూ ఆగస్టు 15న సీఎం రేవంత్‌రెడ్డి చేత ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేయించాలనే లక్ష్యంతో పని చేస్తున్నారు. 15వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా నీరు విడుదల చేయించేందుకు ముమ్మరంగా కసరత్తు చేసున్నారు. తన సొంత నియోజకవర్గమైన ఖమ్మంలో కొత్త మెడికల్ కాలేజీ, స్వామినారాయణ ఇంటర్నేషనల్ పాఠశాల, అధునాతన వ్యవసాయ మార్కెట్ పనులకు శంకుస్థాపనలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే ఖమ్మం కార్పొరేషన్‌లో సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రఘునాథపాలెం మండలంలోనూ అభివృద్ధి పనులకు కార్యాచరణ చేపట్టారు. ఇప్పటి వరకు రైతు రుణమాఫీ కార్యక్రమంలో బిజీగా ఉన్న తుమ్మల ఇక నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై ఫోకస్ పెట్టారు. ఇక రెవెన్యూ, సమాచారశాఖ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసెంబ్లీ సమావేశాల అనంతరం పాలేరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తూ కేడర్‌తో మమేకమవుతున్నారు. మరోవైపు పాలేరు జేఎన్‌టీయూ కళాశాల శంకుస్థాపనకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల నియోజకవర్గ పరిధిలోని ఆయకట్టుకు పాలేరు పాతకాలువ, భక్తరామదాసు ఎత్తిపోతల ద్వారా సాగునీరు విడుదల చేశారు.

అందరి దృష్టి సీఎం పర్యటనపైనే..

సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి జిల్లాకు విచ్చేయనున్న సీఎం పర్యటనపైనే అందరు నేతలు దృష్టి సారించారు. 15వ తేదీన సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటి విడుదలకు ముహూర్తం నిర్ణయించడంతో పనులు చకాచకా సాగుతున్నాయి. మంత్రి తుమ్మలతోపాటు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ నేతలు సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మొత్తంమీద ఎన్నికల హామీల అమలుపై మంత్రులు దృష్టిసారించడంతో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది.

టీ-టెన్ రాష్ట్ర జట్టుకు యశ్వంత్

పెనుబల్లి, ఆగస్టు 5: జూనియర్ టీ-టెన్ చాంపియన్ షిప్ 2024-25 రాష్ట్ర జట్టుకు మండలంలోని కుప్పెనకుంట్ల గ్రామానికి చెందిన వర్దెబోయిన యశ్వంత్ యాదవ్ ఎంపికయ్యాడు. అక్టోబరు 18 నుంచి ఉత్తరాఖండ్ రోరీకీలో జరగనున్న పోటీలకు ఆయన ఎంపికయ్యాడు. గతంలోనూ యశ్వంత్ అనేక పోటీల్లో పాల్గొన్నాడు. జూలై 23 నుంచి ఆర్మూర్ మోడల్ స్కూల్లో జరిగిన ఎంపికల్లో యశ్వంత్ పాల్గొని ప్రతిభ కనపర్చి ఎంపికయ్యాడు.

కూసుమంచి సీఐగా సంజీవ్

ఖమ్మం క్రైం ఆగస్టు 5: కూసుమంచి సీఐగా తొర్రూర్ సర్కిల్ సీఐగా ఉన్న టి. సంజీవ్ నియమితులయ్యారు. ఈ మేరకు పోలీస్‌శాఖ నుంచి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం కూసుమంచి సీఐగా ఉన్న బి. జనార్ధన్ మల్టీజోన్-1 ఐజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా వరంగల్ కమిషనరేట్లో ఎస్ఐగా ఉన్న జే.నాగరాజును కూసుమంచి పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా నియమితులయ్యారు. కూసుమంచిలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ అన్నం కిరణ్‌కుమార్‌ను టాస్క్‌ఫోర్స్ ఖమ్మం కమిషనరేట్‌కు బదిలీ చేశారు. తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో గా మహబూబాబాద్ జిల్లాకు చెందిన కూచిపూడి జగదీష్‌ను నియమిస్తూ పోలీస్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఎఫ్‌డీవోగా సుజాత బాధ్యతల స్వీకరణ

భద్రాచలం, ఆగస్టు 5: భద్రాచలం డివిజనల్ అటవీశాఖ అధికారిగా (ఎఫ్‌డీవో) సోమవారం ఎస్.సుజాత బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల వరకు ఇక్కడ జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్ పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఈ క్రమంలో బదిలీపై వచ్చిన సుజాత ఎఫ్‌డీవోగా బాధ్యతలు చేపట్టారు. కాగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎఫ్‌డీవో సుజాతను టీఎన్‌జీవో అధ్యక్షుడు డెక్కా నరసింహారావు ఆధ్వర్యంలో నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా ఆమెకు పూలమొక్కను అందజేశారు. అనంతరం సుజాత మాట్లాడుతూ భద్రాచలంలో ఉద్యోగం చేయడం పూర్వజన్మ సుకృతమని, ఆ రామయ్య ఆశీస్సులుండటం వల్లనే ఇక్కడ ఉద్యోగం నిర్వహించే అవకాశం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో నాయకులు గగ్గూరి బాలకృష్ణ, జి.నరసింహారావు, కృష్ణయ్య, శ్యామల శ్రీనివాస్, గాంధీ, ఇళ్లప్రోలు కృష్ణ, అంజిబాబు, హరి రామకృష్ణ, రాధిక, లక్ష్మణ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

104 వాహనాల వేలం

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 5: ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో గతంలో పనిచేసిన 104 హెల్త్ సర్వీసెస్ వాహనాలను వేలం వేయనున్నట్లు జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.మాలతి తెలిపారు. మొత్తం 11 స్వరాజ్ మజ్దా కంపెనీ 2008 మోడల్ వాహనాలను జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఉన్న వాటికి వేలాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆసక్తి కలిగిన వారు ఒక లక్ష రూపాయలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి, ఖమ్మం పేరు మీద డిపాజిట్ చేసి వేలములో పాల్గొనాలని ఆమె కోరారు.

వైద్య పోస్టుల భర్తీలో
తొలి ప్రాధాన్యం ఏజెన్సీకే

- భద్రాద్రిలో ప్రసవాలు తగ్గాయి
- వైద్యుల కోసం దరఖాస్తులు ఆహ్వానించినా స్పందన లేదు
- ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమం పెట్టకండి
- వైద్యశాలను పరిశీలించిన టీజీవీవీపీ కమిషనర్


రోగులను పరామర్శిస్తున్న కమిషనర్ అజయ్‌కుమార్

భద్రాచలం/కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 5: రాష్ట్రంలో త్వరలో ప్రభుత్వం భర్తీ చేసే 1,690 వైద్య పోస్టుల్లో తొలి ప్రాధాన్యం ఏజెన్సీకే ఇస్తామని టీజీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. భద్రాచలంలో సోమవారం ప్రభుత్వ ఏరియా వైద్యశాలను ఆయన పరిశీలించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, వైద్య ఆరోగ్యశాఖ కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టియాన జెడ్ చాంగ్తూ ఆదేశాల మేరకు తానురావడం జరిగిందన్నారు. ప్రభుత్వం వైద్య పోస్టులు భర్తీ చేసేందుకు చిత్తశుద్ధితో ఉందని ఇదే సమయంలో ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతోందని తెలిపారు. వైద్యసేవలతో పాటు రోగులకు అందించే ఆహారం విషయంలో సైతం ఎంతో దృష్టిసారిస్తున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. అంతేకాని ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమం పెట్టవద్దని హితవు పలికారు. అంతకుముందు ఏరియా వైద్యశాల పరిశీలనకు వచ్చిన ఆయన వివిధ వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతర ఆయన భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు, ఏరియా వైద్యశాల సూపరిం టెండెంట్ ఎం.రామకృష్ణ, ఇతర వైద్యులు ఉన్నారు.

అదేవిధంగా కొత్తగూడెం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి, ఐడీవోసిలోని డీసీహెచ్ఎస్ కార్యాలయాల్లో వేర్వేరుగా జిల్లా వైద్యాధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశాలు ఉన్నాయని, ఏజెన్సీలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ల్యాబ్‌లలో సరిపడ కెమికల్స్, బయోపరికరాలు ఉండేలా ఎప్పటికప్పుడు ఉన్నత అధికారులకు సమాచారం అందిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.


గిరిజన దర్బారు నిర్వహిస్తున్న పీవో రాహుల్

ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

ఐటీడీఏ పీవో బి.రాహుల్

భద్రాచలం, ఆగస్టు 5: ఈ నెల 9న జరిగే ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు వివిధ ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, గిరిజన ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. సోమవారం తన చాంబర్‌లో ఐటీడీఏ అధికారులు, గిరిజన ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులతో ఆదివాసీ దినోత్సవ ముందస్తు ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి వచ్చే ప్రముఖులకు ఆదివాసీ గిరిజనుల సంప్రదాయం ప్రకారం ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆదివాసీ వంటకాలతో వారిని ఆనందింపజేసే విధంగా కార్యక్రమాల ఏర్పాట్లు చేయాలన్నారు. ఆదివాసీ వంటకాలతో భోజన సౌకర్యం కల్పించాలని సంఘ సభ్యులకు పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు, ఏసీఎంవో రమణయ్య, మేనేజరు ఆదినారాయణ, ఈవో శ్రీనివాస్, ఆదివాసీ ప్రతినిధులు పూనెం కృష్ణ, వీరస్వామి, రాధ, రమాదేవి, కన్నరాజు, జగ్గా పుల్లయ్య, కుంజా శ్రీను, సుధారాణి పాల్గొన్నారు.

గిరిజన దర్బార్ నిర్వహించిన పీవో

ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం సందర్భంగా గిరిజన దర్బార్‌లో యూనిట్ అధికారుల సమక్షంలో పీవో బి.రాహుల్ గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గిరిజన గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఆర్సీవో నాగార్జున రావు, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఏపీవో పవర్ మునీర్‌పాషా పాల్గొన్నారు.


మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

సమాజ శ్రేయస్సుకు పాటుపడిన మహనీయులు
గాంధీ, అంబేద్కర్

విగ్రహాలను ఆవిష్కరించిన జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

కల్లూరు, ఆగస్టు 5 దేశ అభ్యున్నతికి జాతిపిత గాంధీ పాటు పడగా, సమాజంలో అంతరాలను తొలిగించటంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌ల విగ్రహాలను జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఎంపీపీ బీరవల్లి రఘులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ సమాజంలో సమస్త వర్గాల ప్రజలకు సరియైన పాలన అందిచేలా రాజ్యాంగాన్ని అంబేద్కర్ ఆవిష్కరిచారన్నారు. ఎంపీటీల, జడ్పీటీల పదవి విరమణ సందర్భంగా మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు, 18 మంది ఎంపీటీసీలకు జడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ శాలువతో సత్కరించి అభినందించారు.

వ్యవసాయ అధికారుల
బదిలీలు

16 మందికి వివిధ ప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్లు

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 5: ఖమ్మం జిల్లాలో 16 మంది వ్యవసాయ అధికారులను వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ సోమవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు. అధికారుల బదిలీల కౌన్సెలింగ్‌లో భాగంగా ఈ ట్రాన్స్‌ఫర్లు జరిగాయి. 1. ఉమా మహేష్ (ఖమ్మం డీఈవో నుంచి ఖమ్మం రూరల్), 2. మంద ప్రతాప్ (ఖమ్మం డీఏవో నుంచి నేలకొండపల్లి),3. సరిత (బోనకల్ నుంచి ముదిగొండ), 4. రామకృష్ణ (ఖమ్మం ఎఫ్‌పీసీ నుంచి భద్రాద్రి జిల్లా ఇల్లెందు ఏవో టెక్నికల్), 5. శ్రీదేవి (బీసీల్యాబ్ నుంచి ఏవో టెక్నికల్ బంగ్లా), 6. విజయభాస్కర్ రెడ్డి(ఎర్రుపాలెం నుంచి బోనకల్), 7. నారాయణరావు (నేలకొండపల్లి నుంచి బీసీ ల్యాబ్), 8. పి.వాహిణి (ఏవో ఎస్‌పీఎల్ నుంచి మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి ఏవో), 9. ఇ.భాస్కర్‌రావు (రఘునాధపాలెం నుంచి ఎఫ్‌టీసీ ఖమ్మం), 10, చావా రాజ్(డీఏవో నుంచి సీరోలు మహబూబాబాద్‌జిల్లా), 11. నాగేశ్వరరావు (ఖమ్మంరూరల్ నుంచి ఎస్‌పీఎల్ ఖమ్మం), 12. ఎం రాధ (ముదిగొండ నుంచి ఎర్రుపాలెం), 13. వినయకుమార్ (ఎస్‌పీఎల్ నుంచి నర్సింహులపేట మహబూబాబాద్‌జిల్లా), 14.ఎస్.పవన్ (వైరా నుంచి డీఏవో), 15. ఉమామహేశ్వరరెడ్డి (సింగరేణి నుంచి రఘనాథపాలెం), 16. కె.రాజు (ఎస్‌పీఎల్ నుంచి ఏవో టెక్నికల్ ఏడీఏ మహబూబాబాద్ జిల్లా).


ఖజానాశాఖ డీడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంటపల్లి

ఖజానాశాఖ డీడీగా వెంటపల్లి సత్యనారాయణ

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 5: ఖమ్మం జిల్లా ఖనాజాశాఖ డీడీగా వెంటపల్లి సత్యనారాయణ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఆయనకు సాధారణ బదిలీల్లో మహబూబాద్ డి.టి.ఓగా వెళ్లి అక్కడ సోమవారం బాధ్యతలుచేపట్టారు. తిరిగి సాయంత్రం ఖమ్మం జిల్లా ఖజానా కార్యాలయనికి కూడా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ శాఖ డైరెక్టర్ కెఎస్ఆర్సీ మూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మోదుగు వేలాద్రి, నయం భాషా, డీపీ గణేష్, వైరా ఏటీవో ట్రెజరీ గెజిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ప్రసన్నకుమార్, విజయ్ కుమార్, మరిపెడ డివిజనల్ అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ శ్రీమతి టి.కృష్ణకుమారి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ట్రెజరీ నాన్ గెజిటెడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కంచి శ్రీనివాసరావు దుర్గాప్రసాద్ రవీంద్రబాబు తదితరులు డీడీకి అభినందనలు తెలిపారు.

మంత్రి తుమ్మల చొరవతో
ఖమ్మంలో డంపింగ్ సమస్యకు చెక్

- కమిషనర్ ఆగస్త్యతో సమావేశమైన ముంబాయి బృందం
- రోజుకు 180మెట్రిక్ టన్నుల వ్యర్థాలు శుద్ధి, ఏరివేతకు ఒప్పందం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 5: ఖమ్మం నగరపాలక సంస్థ పాలకవర్గానికి పెద్ద సమస్యగా మారిన పారిశుధ్య వ్యర్థాల డంపింగ్ నిర్వాహణకు ఇక శాశ్వత చెక్ పడనుంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ, కేఎంసీ కమిషనర్ ఆగస్త్య తనకు గతంలో పని చేసిన పట్టణాల్లో ఉన్న సంబంధాలు ఖమ్మం నగర పాలక సంస్థ డంపింగ్ యార్డుకు చెక్ పడనుంది.

ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆగస్త్యతో ముంబాయికి చెందిన బృందం సభ్యులు సోమవారం కేఎంసీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరపాలక సంస్థలో ఎంత వ్యర్థాలు ఉత్పత్తి జరుగుతుంది. వాటిని తరలించే క్రమంలో ఇబ్బందులు, ప్రస్తుత లక్ష్యాలను కమిషనర్ ఆగస్త్య ముంబాయి బృందానికి వివరించారు. రోజుకు 180 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించడం జరుగుతుందని వివరించారు. దీంతో ముంబాయి బృందం సభ్యులు కేఎంసీతో తొలి దశ అగ్రిమెంట్‌కు అంగికరించినట్లు తెలుస్తోంది. తమకు రెండు ఏకరాల స్థలంతో పాటుగా విద్యుత్, ఇతర సౌకర్యాలు కల్పించాలని ముంబాయి బృందం కోరినట్లు తెలిసింది. ఒక్కో మెట్రిక్ టన్ను వ్యర్థాలకు రూ.600 వ్యయంతో డంపింగ్ వ్యర్థాలను వేరువేసి ఇతర అవసరాలకు ఉపయోగపడేలా అంగీకారం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఇక ఏ రోజు చెత్త డంపింగ్ ఆదే రోజు వ్యర్థాలను తొలగించిందుకు భవిష్యత్ కార్యచరణకు పునాదులు పడ్డాయి.

ప్రత్యేక అధికారుల నియామకం

ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం 5: భద్రాద్రి జిల్లాలో మండల పరిషత్ అధ్యక్షుల పదవీ కాలం ముగియడంతో 21 మండలాలకు మండల ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం ఉత్వర్వులు జారీ చేశారు. ఆళ్లపల్లి- పి. వాసవి, అన్నపురెడ్డిపల్లి-అనసూర్య, అశ్వాపురం-ఇమ్తీయజ్ అహ్మద్‌ఖాన్, అశ్వారావుపేట- ప్రదీప్ కుమార్, బూర్గంపాడు- వెంకటేశ్వరరెడ్డి, చండ్రుగొండ- కె. సంజీవరావు, చర్ల-సుధాకర్, చుంచుపల్లి- బి. సులోచన రాణి, దమ్మపేట- అఫ్జల్ బేగమ్, దుమ్ముగూడెం-మనెమ్మ, గుండాల- సయ్యద్ కుర్షిద్, జూలురుపాడు- రుక్మిణిదేవి, కరకగూడెం- దినేష్, లక్ష్మీదేవిపల్లి - బాబురావు, మణుగూరు- అలీమ్, ములకలపల్లి- రమేష్, పాల్వంచ- తిరుపతయ్య, పినపాక-తాతారావు, సుజాతనగర్-త్రినత్ బాబు, టేకులపల్లి- శ్రీరామ్, ఇల్లెందుకు సూర్యనారాయణలను నియమించారు. మంగళవారం నుంచి ప్రత్యేక అధికారుల తమ పదవి బాధ్యతలు కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.

ఖమ్మంలో నియమితులైన అధికారులు

ఖమ్మం కలెక్టరేట్: మండల ప్రజాపరిషత్ పాలకవర్గాలకు పదవీకాలం ముగియడంతో జిల్లాలోని 20 మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక అధికారులుగా జిల్లా అధికారులను నియమించారు. దీంతో ఇక నుంచి మండల ప్రజాపరిషత్‌లకు సంబంధించిన కార్యక్రమాలను ప్రత్యేక అధికారులే పర్యవేక్షించనున్నారు. తిరిగి ఎన్నికలను నిర్వహించే వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది.

బోనకల్- విజయభాస్కరరెడ్డి, చింతకాని- కె. చందన్‌కుమార్, ఏన్కూరు - పి. సింగద్, కల్లూరు - పి. సునీత, కామేపల్లి- బి. శ్యాంప్రసాద్‌రాజు, ఖమ్మం రూరల్- జి. జ్యోతి , కొణిజర్ల- కె. రాంగోపాల్‌రెడ్డి, కూసుమంచి - జి శ్రీలత, మధిర- ఏ. శ్రీనివాస్, ముదిగొండ- ఎన్. విజయలక్ష్మి, నేలకొండపల్లి- ఈ. సోమశేఖరశర్మ, పెనుబల్లి- డి. శ్రీనివాసులు, రఘునాధపాలెం- మహమూది, సత్తుపల్లి- టి. సునిల్‌కుమార్‌రెడ్డి, సింగరేణి- కె. అజయ్‌కుమార్, తల్లాడ- జి. రాజనర్సయ్య, తిరుమలాయపాలెం- ఎం. విజయనిర్మల, వేంసూరు- హుస్సేన్, వైరా - కె. సత్యనారాయణ, ఎర్రుపాలెం- డాక్టర్ బి. వేణుమనోహర్ నియమితులయ్యారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

ఖమ్మం క్రైం ఆగస్టు 5: రైలుకింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. సత్తుపల్లి మండలం కాకరపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణ(35) అనే వ్యక్తి సోమవారం రాత్రి నవజీవన్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కాగా వ్యక్తి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

కాలగర్భంలోకి కొండ గుర్తులు

పాల్వంచ కేటీపీఎస్‌లో 8 కూలింగ్ టవర్ల నేలమట్టం


నేలమట్టమైన కేటీపీఎస్ కూలింగ్ టవర్లు ఇవే

పాల్వంచ, ఆగస్టు 5: పాల్వంచ పట్టణంలోని కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో గల ఓఅండ్ఎం (పాత ప్లాంట్)లోని కూలింగ్ టవర్ల కూల్చివేత పనులు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పటిష్ట బందోబస్తు మధ్య జెన్‌కో అధికారులు, కాంట్రాక్టర్, ఎస్‌పీఎఫ్ సిబ్బందితోపాటు సివిల్ పోలీసుల సమక్షంలో ఎనిమిది కూలింగ్ టవర్లను కూల్చివేశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ ప్రక్రియ నిమిషాల వ్యవధిలోనే పూర్తి కావడం విశేషం. దేశంలో ప్రస్తుతం వినియోగంలో ఉన్న నూతన టెక్నాలజీతో అత్యాధునిక పేలుడు పదార్థాలను వినియోగించి సదరు కాంట్రాక్ట్ పొందిన వారు కూలింగ్ టవర్ల కూల్చివేత ప్రక్రియను ప్రశాంతంగా ముగించారు. కూల్చివేసే సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కేంద్రం ఆదేశాల మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కాలం చెల్లిన విద్యుదుత్పత్తి కేంద్రాలను ఆయా విద్యుత్ సంస్థలు తొలగించడం ప్రారంభించాయి. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్రంలో పాత టెక్నాలజీతో కొనసాగుతున్న కేటీపీఎస్ పాత ప్లాంట్‌ను తొలగించాలని జెన్‌కో యాజమాన్యం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా 2020లోనే కర్మాగారాన్ని మూసివేశారు. కర్మాగారాన్ని కూల్చివేయడంతోపాటు స్క్రాప్‌ను తరలించడానికి హెచ్‌ఆర్ అనే ప్రైవేటు సంస్థకు కాంట్రాక్ట్ పనులను అప్పగించారు. 2023 జనవరి నుంచి ఆ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కూల్చివేత, స్క్రాప్ తరలింపు పనులు దాదాపు 95శాతం పనులు పూర్తయ్యాయి. ఇక మిగిలింది కూలింగ్ టవర్లను తొలగించడమే. జెన్‌కో అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో హెచ్‌ఆర్ సంస్థ పేల్చివేత ద్వారా కూల్చివేసే కాంట్రాక్టును రూ.2 కోట్లకు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఎక్స్‌ట్యాప్ అనే సంస్థకు అప్పగించింది. వారు రెండు నెలల నుంచి కూల్చివేత ప్రక్రియ పనులను ప్రారంభించారు. సుమారు 30మంది సిబ్బంది నూతన టెక్నాలజీతో ఇంప్లోజన్ అనే పేలుడు పదార్థాలను వినియోగించి సోమవారం కూలింగ్ టవర్లను నేలమట్టం చేశారు. 8టవర్లలో నాలుగింటి ఎత్తు 103 మీటర్లు కాగా, మరో నాలుగింటి ఎత్తు 115 మీటర్లు కావడం విశేషం.

ఏపీఎస్ఈబీ 1966లో పాల్వంచలో ఓఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) కర్మాగారం ఏ, బీ, సీ యూనిట్లను ప్రారంభించింది. వాటి ద్వారా మొత్తం 720 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్రారంభించింది. అప్పటి నుంచి నిరంతరాయంగా రాష్ట్రంలో విద్యుదుత్పత్తి చేసే సంస్థగా పేరు సంపాదించుకుంది. వేలాది మంది కార్మికులకు, ఇంజనీర్లకు, ఉద్యోగులకు జీవితాన్నందించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా పేరును ఇతర రాష్ట్రాలకు వ్యాపింపజేసిన ఘనత పాల్వంచకు మాత్రమే ఉందంటే అతిశయోక్తి కాదు. దేశంలో ఖమ్మం, కొత్తగూడెం పేర్లు ఎవరికీ తెలియక పోయినా పాల్వంచ మాత్రం అందరికీ సుపరిచితం. విద్యుత్ ఉత్పాదనలోనూ కేటీపీఎస్ పాత ప్లాంట్ ఎన్నో మైలు రాళ్లను దాటి విద్యుత్ రంగంలో చరిత్రను సృష్టించింది. బస్సులో వెళ్లేవారు. వాహనదారులు సునాయాసంగా పాల్వంచను గుర్తు పడతారంటే పాత ప్లాంట్‌కు చెందిన కూలింగ్ టవర్లే కారణం. కేటీపీఎస్ చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన కూలింగ్ టవర్లు నేలమట్టం కావడాన్ని స్థానిక ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. తెలంగాణ తొలిదశ ఉద్యమం కూడా కేటీపీఎస్ పాత ప్లాంట్ నుంచి ప్రారంభం కావడంతో మర్చిపోలేని మరో జ్ఞాపకం.

విద్యారంగ
సమస్యలు పరిష్కరించాలి

- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రదర్శన

ఖమ్మంటౌన్, ఆగస్టు 5: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని కాల్వొడ్డు నుంచి జూబ్లీక్లబ్, మయూరి సెంటర్, పాతబస్టాండ్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి, అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పీడీఎస్‌యూ ప్రతినిధి బృందం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు అందజేశారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే తగిన మూల్యం చెల్లించవలసి వస్తుందని హెచ్చరించారు. జిల్లా ప్రజల చిరకాలవాంఛ అయిన యూనివర్శిటీ ఏర్పాటు విషయాన్ని ముగ్గురు మంత్రులు ఉండి పట్టించుకోవడం లేదన్నారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని, బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 7.5 శాతం నిధులను మాత్రమే కేటాయించిందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఆజాద్, వెంకటేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు టీ.లక్ష్మణ్, రాష్ట్ర నాయకుడు సతీష్, జిల్లా నాయకులు శేషు, వినయ్, కార్తీక్, ప్రసాద్, వంశీ, గోపి, మమత, సంధ్య, శ్రీలక్ష్మి తదితరులున్నారు.

15న 'సీతారామ' ప్రారంభం

- సీఎం చేతుల మీదుగా పంప్‌హౌస్‌లు ప్రజలకు అంకితం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

వైరా, ఆగస్టు 5: ప్రజల చిరకాలవాంఛను నెరవేరుస్తూ ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లను జాతికి అంకితం చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. అనంతరం వైరాలో లక్షమంది రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 15న సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభ స్థల పరిశీలనను సోమవారం మంత్రి తుమ్మల, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పలుశాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానిక తుళ్లూరి కోటేశ్వరరావుకు చెందిన పామాయిల్‌తోట సమీపంలోని స్థలాన్ని సీఎం రేవంత్ పాల్గొనే రైతు బహిరంగ సభ కోసం మంత్రి తుమ్మల ఓకే చేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల విలేకరులతో మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు చరిత్రలోనే ఆగస్టు ఐదో తేదీన సాగర్‌జలాలు విడుదల చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని వ్యాఖ్యానించారు. అలాగే రైతు రుణమాఫీకి సంబంధించి కూడా సీఎం రేవంత్‌రెడ్డి వైరా సభలో స్పష్టమైన ప్రకటన చేస్తారని స్పష్టం చేశారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవమే కాకుండా రైతు దినోత్సవంగా జరుపుకోబోతున్నామని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సొంత ప్రాంతంలో సీఎం బహిరంగ సభ నిర్వహించేందుకు ఆయన కూడా ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. సీఎంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలువురు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, కట్ల రంగారావు, దొడ్డా పుల్లయ్య, పాలేటి నర్సింహారావు, మట్టూరి వెంకటేశ్వరరావు, మచ్చా బుజ్జీ, పణితి సైదులు, పొదిల హరినాథ్, బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, రాజశేఖర్, కొండలు, విజయభాస్కర్, రామకృష్ణ, తదితరులున్నారు.

పాపటపల్లి పంచాయతీ కార్యదర్శికి షోకాజ్

- పలు అవినీతి ఆరోపణల నేపథ్యంలో అధికారుల చర్య

రఘునాథపాలెం, ఆగస్టు 5: పలు అవినీతి ఆరోపణల నేపథ్యంలో రఘునాథపాలెం మండలంలోని పాపటపల్లి పంచాయతీ కార్యదర్శి వెంకటరమణకు జిల్లా పంచాయతీ అధికారులు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వెంకటరమణ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ గ్రామస్థులు గతంలో పలుమార్లు కలెక్టర్‌కు ప్రజావాణిలో ఆధారాలతో ఫిర్యాదులు చేశారు. అయితే ఆయనపై విచారణ చేసిన అధికారులు అదే మండల స్థాయిలోని వారు కావటంతో కాపా డే ప్రయత్నాలు చేశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం రఘునాథపాలెం మండలంలో పర్యటించిన సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ అవినీతిపై మళ్లీ ఫిర్యాదులు అందాయి. దీంతో జిల్లా స్థాయిలోని అధికారులు విచారణ చేపట్టాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. ఈ క్రమంలో జిల్లా పంచాయతీ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఇంటి పన్నుల వసూళ్లలో లంచం.. ఇంటి నెంబర్ కేటాయింపులో లంచం.. గ్రామంలో ఫంక్షన్ జరిగితే శుభ్రం చేయకుంటే బకెట్ మాంసం కూర లంచం.. మాజీ సర్పంచులకు కూడా లంచం వేధింపులు.. లాంటి ఎన్నో ఫిర్యాదులు అధికారులకు అందాయి. ఇదిలా వుండగా ఖమ్మం రూరల్ మండలంలో కూడా ఒకే సమయంలో అనేక గ్రామ పంచాయతీలకు ఇంచార్జీగా బాధ్యతలు నిర్వహించి అవినీతి ఆరోపణలు, విచారణలు ఎదుర్కొనడం గమనార్హం. పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ గతంలో జిల్లా బాస్కెట్ బాల్ సంఘం కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఆ పదవిలోనూ ఆయనపై పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇందుకు సంబంధించి ఆంధ్రజ్యోతిలో కథనాలు రావడంతో కార్యదర్శి పదవి నుంచి, రాష్ట్ర సెలెక్షన్ కమిటీ సభ్యుడి పదవి నుంచి తొలగించారు.

ఇండస్ట్రియల్ పార్క్ దశాబ్దాల కల

మధిరరూరల్, ఆగస్టు 5: మధిర ఇండస్ట్రియల్ పార్క్ తన దశాబ్దాల కల అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ పార్క్‌ను రాష్ట్రానికి రోల్‌మోడల్‌గా నిలపాలని అధికారులకు సూచించారు. మధిర మండలం యండపల్లి గ్రామంలో 84 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్క్‌కు సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అందరూ వ్యవసాయ రంగంపైనే ఆధారపడితే క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు ఇబ్బంది పడతామన్నారు. వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, సేవా రంగాలను అభివృద్ధి చేసుకుని సమగ్ర అభివృద్ధి సాధిస్తేనే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. గ్రామాల్లో బాగా చదువుకున్న యువత పరిశ్రమల వైపు మళ్లితే ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇది దేశ భవిష్యత్‌కు మంచిదన్నారు. గ్రామాల్లో వ్యాపారం చేసేవారు సమాజంలో వచ్చిన మార్పులకనుగుణంగా తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. అలాంటి వారికి తమ ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి ప్రోత్సహిస్తుందన్నారు. మధిరలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయడం తన కల అన్నారు.

84 ఎకరాల్లో నిర్మించనున్న ఇండస్ట్రియల్ పార్క్‌కు రూ.44కోట్ల నిధులు కేటాయించినట్టు తెలిపారు. మధిర ఇండస్ట్రియల్ పార్క్ పనులకు వెంటనే టెండర్లు పిలిచి వేగంగా పనులు ప్రారంభించాలన్నారు. మధిర ఇండస్ట్రియల్ పార్క్ రాష్ట్రానికి రోల్‌మోడల్‌గా ఉండాలని, ఇతర ప్రాంతాల వారు వచ్చి ఈ పారిశ్రామిక ప్రాంతాన్ని సందర్శించేలా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతీఏడాది రూ.20వేల కోట్ల వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వమే పరిశ్రమలు, వ్యాపారానికి సంబంధించిన ప్రాజెక్ట్ రిపోర్టు, బ్యాంకు రుణాలు, మార్కెటింగ్ వసతులు కల్పించి పారిశ్రామిక రంగంలో వారిని ప్రోత్సహిస్తుందన్నారు.

మధిర ఇండస్ట్రియల్ పార్కును అనుసంధానించేందుకు రెండు వైపులా రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. ఇండస్ట్రియల్ పార్క్‌లో సరసమైన ధరలకే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్లాట్లు కేటాయిస్తామన్నారు. ప్లాట్ల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళలకు రిజర్వేషన్లు పాటిస్తామన్నారు. ఏపీ రాజధానికి మధిర సమీపంలో ఉండగా విజయవాడ-నాగపూర్-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేలు మధిర నియోజకవర్గం నుంచి వెళుతున్నాయన్నారు. ఇవి ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధికి మూలస్తంభాలుగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ సెక్యూరిటీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఇండస్ట్రీస్ ఈడీ కళ్యాణ్, ఇండస్ట్రియల్‌శాఖ అధికారులు నిఖిల్ చక్రవర్తి, వినోద్‌కుమార్, జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల చైర్మన్ నాయుడు సత్యం, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, డీసీసీబీ జిల్లా చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన ప్రైవేట్ పాఠశాలల్లో

రికార్డులు మాయం

- సర్టిఫికెట్ల కోసం పూర్వ విద్యార్థులు పడరాని పాట్లు
- జిల్లాలో పదుల సంఖ్యలో ప్రైవేట్ స్కూళ్ల మూసివేత
- రిజిస్టర్లు స్వాధీనం చేసుకోని విద్యాశాఖ అధికారులు

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఆగస్టు 5: ఖమ్మం జిల్లా పరిధిలో ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు పాత సర్టిఫికెట్లు 1 నుంచి 5 తరగతులు, 6 నుంచి 10వ తరగతి వరకు తీసుకోని కొందరు పూర్వ విద్యార్థులు ప్రస్తుతం అవసరం కాగా ఆ పాఠశాలలకు వెళ్లగా అవి మూతబడి ఉండటంతో పాటు రికార్డులు మాయమైనట్లు తెలుస్తోంది. దీంతో గతంలో ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కాని ఆ పాఠశాలలకు సంబంధించిన రికార్డులు డీఈవో కార్యాలయాల్లో లేకపోవడంతో పూర్వ విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభించాలన్నా, మూసివేయాలన్నా జిల్లా విద్యాశాఖ కార్యాలయ నిబంధనల ప్రకారం పాఠశాల రికార్డులను డీఈవో కార్యాలయానికి సమర్పించాల్సి ఉంటుంది. దీంతో ఎన్ని సంవత్సరాలైనా ఆ పాఠశాలల రికార్డులు డీఈవో కార్యాలయంలో భద్రంగా ఉంటాయి. డీఈవో కార్యాలయ అధికారులు కాని, సంబంధిత మండల ఎంఈవోలు, పాఠశాల యజమానులు కాని రికార్డులను డీఈవో కార్యాలయానికి అందించడంలో నిర్లక్ష్యంగా ఉండటంతో నేడు అవసరమైన సర్టిఫికెట్లు అందకుండ పోతున్నాయి. దీంతో కొంత మంది పూర్వ విద్యార్థులు వేరే పాఠశాలల్లో చదివినట్లు డబ్బులు చెల్లించి తీసుకుంటున్నారనే విమర్శలు వినబడుతున్నాయి. ఈ విషయాలు జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలిసినప్పటికీ ఏ యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రైవేట్ పాఠశాలల్లో కనిపించని రికార్డులు ?

ఖమ్మం జిల్లా కేంద్రంతో పాటు చింతకాని, కూసుమంచి, మధిర, నేలకొండపల్లి, సింగరేణి, తిరుమలాయపాలెం మండలాల్లో ఈ ఐదేళ్ల కాలంలో పదుల సంఖ్యలో ప్రైవేట్ పాఠశాలలను నడపలేక మూసివేశారు. అయితే ఆయా పాఠశాలలకు చెందిన అడ్మిషన్ రిజిస్టర్లను, ఇతర రికార్డులను ప్రభుత్వానికి స్వాధీనం చేయలేదు. ప్రైవేట్ పాఠశాలల యజమానులు తాము పాఠశాలలను నడపకున్నా, విద్యార్థులకు సంబంధించిన పలు రకాల రికార్డులను తమ వద్దనే అట్టిపెట్టుకున్నారు. వాస్తవానికి ప్రభుత్వ ఆమోదం ఉన్న పాఠశాలను మూసివేస్తే.. దానికి సంబంధించిన అన్ని రికార్డులను విద్యాశాఖ అధికారులకు అప్పగించాలి. జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా ఆయా యాజమాన్యాల నుంచి రికార్డులను స్వాధీనం చేసుకోవాలి. కాని ఈ ప్రక్రియ జిల్లాలో ఎక్కడా కనిపించడం లేదు. ఒక్క పాఠశాల రికార్డులు కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొన్ని ప్రీ స్కూల్, 1 నుంచి 5 తరగతులకు సంబంధించిన పాఠశాలల వివరాలు విద్యాశాఖ వద్ద లేకపోవడం గమనార్హం.

పూర్వ విద్యార్థుల తిప్పలు..

వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ప్రస్తుతం పోటీ పరీక్షలకు దరఖాస్తు చేయడానికి అప్పటి స్టడీ సర్టిఫికెట్ల కోసం తిరుగుతున్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు తాము చదివిన పాఠశాలలు ప్రస్తుతం మూసివేసి ఉండటంతో ఎవరిని కలువాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఎంతో వ్యయప్రయాసలకోర్చి దూర ప్రాంతాల నుంచి జిల్లాలోకి తాము చదివిన పాఠశాల ప్రాంతాలకు వస్తున్న వారికి యాజమాన్యాల చిరునామా లేక నిరాశ



చెందుతున్నారు. ఒకవేళ యాజమాన్యాల చిరునామా తెలిసినా వారు అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని పలువురు పూర్వ విద్యార్థులు వాపోతున్నారు. భారీ మొత్తంలో డబ్బులు తీసుకొని సంబంధిత సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు సమాచారం. మరికొందరు ఆ పాఠశాలల్లో చదవకున్నా వారి పేరు మీద కూడా సర్టిఫికెట్లు అందిస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. అప్పట్లో ఆన్‌లైన్‌లో వివరాలు సేకరణ లేకపోవడం ప్రస్తుతం వారికి కనక వర్షం కురిపిస్తుంది.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారి చదువుకు సంబంధించి ఇంటలీజెన్స్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను తనిఖీ చేస్తారు. దానికోసం ఆయా అభ్యర్థులు చదివిన పాఠశాలలకు వెళ్లి రిజిస్టర్లలో తనిఖీలు చేస్తారు. అయితే అప్పటి పాఠశాలలు ప్రస్తుతం లేకపోవడంతో ఉద్యోగాలు సాధించిన వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ముందుకు సాగడం లేదు. అదే ప్రభుత్వం రికార్డులు స్వాధీనం చేసుకుని ఉంటే నేరుగా విద్యాశాఖ నుంచే సర్టిఫికెట్లు తీసుకోవడం, వెరిఫికేషన్ చేయడం అవుతుందని పూర్వ విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు. పలువురు పూర్వ విద్యార్థులు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి సర్టిఫికెట్ల కోసం తిరుగుతున్నట్లు సమాచారం.

గత ఏడాది సుమారు 12 పాఠశాలల మూసివేత

కాగా గత ఏడాది జిల్లాలో సుమారు 12 పాఠశాలలు మూతపడగా వాటికి సంబంధించి రికార్డులు విద్యాశాఖ వద్ద లేకపోవడంతో ఆయా పాఠశాలల్లో చదివిన పలువురు విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని తెలిసింది. ఇకనైనా విద్యాశాఖ ఇటువంటి పాఠశాలలపై దృష్టి పెట్టి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారం కోసమే
మండలాల్లో ప్రజావాణి: కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

వైరా, ఆగస్టు 5: స్థానిక ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే మండల కేంద్రాల్లో ప్రజావాణిని నిర్వహిస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. సోమవారం వైరా రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ప్రజల నుంచి కలెక్టర్ స్వయంగా దరఖాస్తులు సేకరించి, వారి సమస్యలను పరిశీలించారు. ప్రతి సమస్యను రికార్డుల్లో నమోదు చేసి వారం రోజుల్లో వారి సమస్యను పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రతి అధికారి జవాబుదారితనంతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజావాణికి హాజరైన ఆయాశాఖల అధికారుల గురించి ఆరా తీశారు. సకాలంలో ప్రజావాణికి రాని సంబంధితశాఖ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. అలాగే ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి వైరా పర్యటనను పురస్కరించుకొని సంబంధితశాఖ అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

మహిళపై దాడి చేసిన పోలీసులను శిక్షించాలి

- పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 5: ఇంట్లో దొంగతనం జరిగిందని ఎటువంటి ఆధారాలు లేని మహిళను పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి, ఆమెపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి దాడి చేసిన పోలీసులను కఠినంగా శిక్షించాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి తీవ్రంగా ఖండించారు. సోమవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు లలిత అధ్యక్షతన నిర్వహించిన పీవోడబ్ల్యూ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా షాద్నగర్ పట్నంలో సునీత అనే మహిళపై చోరీ అనుమానంతో పోలీసులు తీవ్రంగా కొట్టారని విమర్శించారు. పలుకుబడి కలిగిన వ్యక్తులు ఇచ్చే ఫిర్యాదులపై పోలీసులు చట్టానికి మించిన స్థాయిలో స్పందించడం ద్వారా ఇటువంటి సంఘటనలను తరుచూ జరుగుతున్నాయని ఆరోపించారు. గతంలో కోమట్లగూడెం, కరీంనగర్‌లో మహిళలపై పోలీసులు ఇలానే దాడులు చేశారని, పోలీసులు వారి తీరు మార్చుకోవాలని కోరారు. అధునిక సమాజంలో ఎంతో సాంకేతిక విజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా దొంగతనం నిర్ధారణ కాకుండానే ఇటువంటి దాడులు పోలీసులు ఏలా చేస్తారని ప్రశ్నించారు. చట్టాలకు లోబడి బాధ్యతలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఝాన్సీ, మంగతాయి, శోభ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు భవన నిర్మాణ కార్మికుల వినతి



మంత్రి సీతక్కకు వినతి పత్రాన్ని అందజేస్తున్న కార్మికులు

మణుగూరు, ఆగస్టు5: తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మేడారంలో మణుగూరు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మణుగూరు మండల సంఘం అధ్యక్షుడు తనుగుల శ్రీను మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను మంత్రి సీతక్క వివరించగా.. సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయంతో లాభాలు

- కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కొత్తగూడెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సమీకృత వ్యవసాయంతో అధిక లాభాలు సాధించవచ్చని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం టేకులపల్లి మండలం సులానగర్ గ్రామంలోని ధరావత్ హార్యా అనే రైతు వేసిన మునగసాగును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ఆర్‌జీఎస్ ద్వారా మునగ పంటను వేస్తు న్న వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహకాలు, సబ్సిడీలు అందుతాయని తెలిపారు. అదేవిధంగా పంట చేనులో ఫారం పాండ్లు ఎనర్జీఎస్ ద్వారా తీయించడం జరుగుతుందని, ఈ ఫారం పాండ్లలో రైతు చేపల పెంపకం చేసుకుంటే లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. ఎకరం సాగు భూమిలో ప్రధానం పండగ పత్తిని సాగు చేస్తూ అంతర పంటగా 1000 మునగ మొక్కలను నాటి సాగు చేస్తున్న రైతును కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పొలంలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం
సబ్ రిజిస్ట్రర్‌గా వేణుమాధవ్



చుంచుపల్లి, ఆగస్టు5: కొత్తగూడెం సబ్ రిజిస్ట్రర్‌గా వి.వేణుమాధవ్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో వరంగల్ చిట్ రిజిస్ట్రర్‌గా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉన్నత అధికారుల సూచనల మేరకు పని చేస్తానని తెలిపారు.

కమ్యూనిస్టు మార్గదర్శకుడు దొండపాటి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

కొణిజర్ల, ఆగస్టు5: విలువలకు మారుపేరుగా నిలిచిన కమ్యూనిస్టు మార్గదర్శకుడు దొండపాటి వెంకయ్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభాపక్ష నాయకులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కొనియాడారు. సోమవారం కొణిజర్లలో స్వర్ణ రమేష్ అధ్యక్షతన జరిగిన దొండపాటి వెంకయ్య వర్ధంతి సభలో కూనంనేని మాట్లాడుతూ వేలాది ఎకరాలు బంజర భూములను పేదలకు అందించి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన వారిలో వెంకయ్య ఒకరని గుర్తు చేశారు. పాలకుల స్వార్థ పరిపాలనతో నిరుద్యోగం, పేదరికం రోజు రోజుకు పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, దొండపాటి రమేష్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ సంఘం నాయకులు గడల భాస్కర్‌రావు, మునిగి కోటేశ్వరరావు, కొణిజర్ల, లింగగూడెం మాజీ సర్పంచ్‌లు సూరంపల్లి రామారావు, దొండపాటి లక్ష్మి, పీవీరావు, తోటపల్లి సీతరాములు, తండు సోమయ్య, పిట్టల రాంబాబు, గొడ్డుగర్ల శ్రీను. వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలి

- ఏఐఎస్ఎఫ్ సంఘం జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ



మాట్లాడుతున్న ఇటికాల రామకృష్ణ

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 5: ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవ ఉత్సవాలు ఈనెల 12నుంచి 31 వరకు నిర్వహిస్తున్నామని సంఘం జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన సంఘం జిల్లా సమితి సమావేశంలో మాట్లాడారు. శాస్త్రీయ విద్యా విధానం కోసం, త్యాగాలు, పోరాటాలే ధ్యేయంగా ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిందని అన్నారు. సమావేశంలో శివనాయక్, ప్రతాప్, రాకేష్, గోపి, రాహుల్, నరేష్ పాల్గొన్నారు.

మొక్కలను విరివిగా నాటాలి: ఎఫ్‌డీవో



మొక్క నాటుతున్న ఎఫ్‌డీవో కోటేశ్వరరావు

జూలూరుపాడు, ఆగస్టు5: గ్రామాలలో ప్రజలు మొక్కలను విరివిగా నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని కొత్తగూడెం ఎఫ్‌డీవో యు.కోటేశ్వరరావు అన్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం జూలూరుపాడులో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఎంపివో తులసీరాం తదితరులున్నారు.

కుల మతాలకు అతీతంగా...
శ్రీశైలం వెళ్లిన చింతగుర్తి గ్రామస్థులు

రఘునాథపాలెం, ఆగస్టు 5: కుల మతాలకు అతీతంగా చింతగుర్తి గ్రామస్థులు రెండు రోజులు పాటు శ్రీశైలం యాత్ర పూర్తి చేసి తిరిగి నివాసాలకు చేరుకున్నారు. ప్రతి సంవత్సరం గ్రామ మాజీ సర్పంచ్ తమ్మినేని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కులమాతాలకు అతీతంగా ఆదివారం చింతగుర్తి నుంచి శ్రీశైలం యాత్రకు హిందూ, ముస్లిం, క్రిష్టియన్ కుటుంబాలు ఒకే వాహనంలో బయలుదేరారు. యాత్రను పూర్తి చేసుకొని సోమవారం తిరిగి నివాసాలకు చేరుకున్నారు. హిందువుల దేవాలయ యాత్ర అయినా పటాన్ ఇస్మాయిల్ ఖాన్, పేరపాక శ్రీను లాంటి ఇతర మతాల వారు సైతం ఉత్సాహంగా యాత్ర పూర్తి చేశారు. గ్రామస్థులు నేటి కాలంలో భిన్నత్వంలో ఏకత్వమని నిరూపణ చేశారు.

మద్యం సేవించి యువకుడి మృతి

జూలూరుపాడు, ఆగస్టు5: ఫూట్‌గా మద్యం సేవించి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వినోభానగర్‌లో చోటు చేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. వినోభానగర్ గ్రామానికి చెందిన గుగులోత్ రమేష్(39) జూలూరుపాడులో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసై తరుచూ మద్యం సేవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం జూలూరుపాడు వచ్చి యథావిధిగా పని చేశాడు. ఇంటికి వెళ్లేటప్పుడు ట్రాక్టర్ యజమాని వద్ద రూ.1,000లు తీసుకొని మార్గమధ్యలో మద్యం సేవించి వెళ్లాడు. భార్య పనికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో అతను అపస్మారక స్థితిలో ఉండడంతో వెంటనే స్థానికుల సహాయంతో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. ఫూట్‌గా మద్యం సేవించడంతోనే రమేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య గుగులోత్ జాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

పలు గ్రామాల్లో
క్షుద్రపూజల కలకలం

జూలూరుపాడు/అశ్వపల్లి, ఆగస్టు5: మండలంలోని సాయిరాంతండాతో పాటు ఆళ్లపల్లి మండలంలో క్షుద్రపూజల కలకలం నెలకొంది. గ్రామంలోని కేలోత్ జామ్లా ఇంటి సమీపంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పసుపు, కుంకుమ, నిమ్మకాయలతో పూజలు చేశారు. దీంతో గిరిజనులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులకు సమాచారాన్ని అందించారు. ఏఎస్ఐ తిరుపతిరావు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ పరికరాలు చోరీ

చింతకాని, ఆగస్టు 5: మండల పరిధిలోని కొదుమూరు విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలోని మూడు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న రాగితీగను అపహరించారు. మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసినప్పటికీ అది తెరుచుకోకపోవడంతో అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఈ ఘటనపై విద్యుత్ శాఖ ఏఈ వెంకన్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుత్ కార్యాలయంలో..

తిరుమలాయపాలెం, ఆగస్టు5: తిరుమలాయపాలెంలోని విద్యుత్ కార్యాలయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్టోర్‌కు సంబంధించిన మూడు తాళాలను పగులగొట్టి కార్యాలయంలోని ఏబీ స్విచ్ కాపర్‌వైర్లు, సపోర్టువైర్లు సుమారు లక్షన్నర విలువైన వాటిని ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం సిబ్బంది తలుపులు తెరిచి ఉండడం చూసిన ఏఈ రవికుమార్‌కు సమాచారం అందించారు. ఈమేరకు ఏఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరిధర్ రెడ్డి తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

చుంచుపల్లి, ఆగస్టు5: మద్యం సేవించి ఆటో నడుపుతూ పలువురికి గాయాలకు కారణమైన ఆటో డ్రైవర్ కిషన్‌పై కేసు నమోదు చేసినట్లు కొత్తగూడెం టూటౌన్ సీఐ రమేష్ సోమవారం తెలిపారు. రుద్రంపూర్ ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో మద్యం సేవించి ఆటో నడుపుతూ ముగ్గురు వ్యక్తులను ఢీకొన్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై నడుచుకుంటూ వస్తున్న సంఘం లలిత్‌కుమార్ ఆటో బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం ఆటో కరెంట్ స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

'ఖమ్మం సూపర్' అనేలా తీర్చిదిద్దాలి

(5వ పేజీ తరువాయి)

పద్ధతిలో కొనసాగించాలని తీర్మానించారు. మేయర్ చాంబర్ రిఫ్రెష్‌మెంట్స్ కోసం 2024-25 సంవత్సరానికి సంబంధించి నెలకు రూ.20వేలు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. నగరంలో ఎంజీఎఫ్, పీపీ, 15వ ఆర్థిక సంఘం, ఎంపీ ల్యాడ్స్, ప్రభుత్వ నిధులు, ఎల్ఆర్ఎస్, సుడా, రైల్వే నిధుల ద్వారా పలు డివిజన్లలో రూ.17.11 కోట్లతో 47 పనులకు ఆమోదం తెలిపారు. ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు రద్దు చేయగా.. ఆయా పనులకు సంబంధించి కాంట్రాక్టర్లు బిడ్ సెక్యూరిటీ కోసం చెల్లించిన రూ. 19.19 లక్షలను తిరిగి చెల్లించాలని తీర్మానించారు. బుర్హాన్‌పురం రెవెన్యూలోని సర్వే నెం.290లో 1700 గజాలు రెసిడెన్షియల్ నుంచి కమర్షియల్ జోన్‌గా మార్చేందుకు, ధంసలాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.51లో 492 గజాలు - కమర్షియల్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌కు, జహీర్‌పురలో 694 గజాలను కమర్షియల్ నుంచి రెసిడెన్షియల్‌గా మార్చేందుకు ప్రతిపాదనలు పెట్టగా సంబంధిత భూములకు సంబంధించిన పూర్వాపరాలు రెవెన్యూ వారితో పరిశీలించి ఆమోదించాలని మంత్రి తుమ్మల సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని 1-30 డివిజన్లలో చెత్త సేకరణ, రవాణాకు సంబంధించి రూ.13.32 లక్షలు, 31-60 డివిజన్లకు రూ.11.52 లక్షలను మునిసిపల్ శాఖ సాధారణ నిధుల నుంచి పాత ఏజెన్సీకే జూలై నెలకు, 31-60 డివిజన్లకు సంబంధించి ఏప్రిల్ నుంచి జూన్ వరకు రూ. 34.54 లక్షలు చెల్లింపులు చేయాలని నిర్ణయిస్తూ తీర్మానించారు.

స్కూల్‌కు టీచర్లను కేటాయించడం లేదని..

- పాఠశాలకు తాళం వేసి గ్రామస్థుల నిరసన
- భద్రాద్రి జిల్లా కుర్వాపల్లిలో ఘటన

అశ్వాపురం ఆగస్టు5: ప్రభుత్వం తమ పాఠశాలకు తగినంత మంది ఉపాధ్యాయులను కేటాయించటం లేదని సోమవారం భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం కుర్వాపల్లి కొత్తూరు ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల తల్లితండ్రులు, గ్రామస్థులు తాళం వేసి నిరసన తెలిపారు. ఉపాధ్యాయులు లేక పోవటంతో పిల్లల భవిష్యత్ అంధకారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కుర్వాపల్లి కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో ఐదోతరగతి వరకు 48మంది విద్యార్థులుండగా, ప్రస్తుతం ఒకేఒక్క ఉపాధ్యాయుడు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నాడు. సదరు ఉపాధ్యాయుడు ఏదైనా కారణం చేతనైనా పాఠశాలకు హజరుకాకపోతే ఆ రోజు పాఠశాల మూతపడే పరిస్థితి ఉంది. ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ బదీలల్లో కూడా కుర్వాపల్లికి అదనపు ఉపాధ్యాయుడిని కేటాయించకపోవటంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాఠశాలకు తాళం వేస్తున్న గ్రామస్థులు

విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదవాలి

- జిల్లా మైనింగ్ డీఈ దినేష్

కరకగూడెం, ఆగస్టు5: విద్యార్థులు చదువులో కష్టపడి కాకుండా ఇష్టంగా చదవాలని అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని జిల్లా మైనింగ్ శాఖ డీఈ దినేష్ తెలిపారు. సోమవారం మండలంలోని చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు టెస్ట్ పరీక్ష నిర్వహించారు. పరీక్షలో మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం కరకగూడెం వైద్యశాలను పరిశీలించిన ఆయన వైద్యశాలలో మందులు, వైద్య సిబ్బంది వివరాలను వైద్యాధికారి మధును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో కుమార్, వైద్యాధికారి మధు, వార్డెన్ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల బాలిక
గాయపర్చుకున్న ఘటనపై విచారణ

భద్రాచలం, ఆగస్టు 5: భద్రాచలంలోని ప్రభుత్వ గిరిజన గురుకులంలో ఓ విద్యార్థిని తనకు తాను గా గాయపర్చుకున్న ఘటనపై భద్రాచలం ఐటీడీఏ సహాయ ప్రాజె క్టు అధికారి డేవిడ్‌రాజు సోమవారం గురుకులం లో విచారణ చేపట్టారు. కళాశాలలోని అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగుల నుంచి వివరాలు సేకరించారు. నివేదికను ఉన్న తాధికారులకు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కోనేరు నాగేశ్వరరావు ఆశయాలు సాధించాలి



నాగేశ్వరరావు ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, గ్రామస్థులు

కొత్తగూడెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):మాజీ మంత్రి కోనేరు నాగేశ్వరరావు ఆశయాలు సాధించాలని కాంగ్రెస్ నాయకుడు కోనేరు సత్యనారాయణ (చిన్ని) అన్నారు. సోమవారం కొత్తగూడెం నియోజకవర్గంలో సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉంటూ మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఎన్టీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేసినటువంటి కోనేరు నాగేశ్వరరావు 8వ వర్ధంతి సం దర్భంగా కొత్తగూడెం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కోనేరు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోనేరు పూర్ణచందర్‌రావు, ఎస్కే. మసీదు, రావి రాంబాబు, కోనేరు నాగేశ్వరరావు, గుగులోత్ కృష్ణ, ఆవల శ్రీనివాస్ యాదవ్, స్మార్ట్ శ్రీను, దండోరా శ్రీను తదితరులు పాల్గొన్నారు. కోనేరు నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో
వ్యక్తికి తీవ్రగాయాలు

చింతకాని, ఆగస్టు 5: విద్యుదాఘాతంతో మండల పరిధిలోని నరసింహపురం గ్రామానికి చెందిన జల్లి రాముకు తీవ్ర గాయాలైన ఘటన చింతకానిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాము మిషన్ భగీరథలో ఆపరేటర్‌గా, ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. చింతకాని గ్రామీణ ఫీడర్ పరిధిలోని ఓ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌కు సాంకేతిక సమస్య తలెత్తడంతో విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎల్‌సీ తీసుకున్న ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న విద్యుత్ స్తంభం కాకుండా పొరపాటున సమీపంలోని ఖమ్మం టౌన్ ఫీడర్ అనుసంధాన ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కడంతో విద్యుదాఘాతానికి గురై స్తంభంపై నుంచి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ ఏఈ వెంకన్న చికిత్స పొందుతున్న రామును పరామర్శించారు.

వైరా నదిలో యువకుడి గల్లంతు

మధిర టౌన్, ఆగస్టు 5: ఈతకు దిగిన ఓ యువకుడు వైరా నదిలో గల్లంతైన సంఘటన సోమవారం మధిరలోని రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో జరిగింది. మధిర పట్టణం బంజార కాలనీకి చెందిన అద్దంకి రవి(19) ఈత కొరకు నదిలో దిగాడు. కాగా నీటి ప్రవాహానికి అతడు గల్లంతయ్యాడు. అక్కడ ఉన్న జాలర్లు చూసి సమాచారాన్ని పోలీసులకు అందించారు. పోలీసులు ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

గోదావరిలో దూకిన మహిళ



శైలజ(ఫైల్)

బూర్గంపాడు, ఆగస్టు5: గోదావరి బ్రిడ్జి పై నుంచి ఓ మహిళ నదిలో దూకిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని సారపాక గాంధీనగర్‌కు చెందిన శైలజ(20) కుటుంబ కలహాల నేపథ్యంలో భద్రాచలం బ్రిడ్జి పైనుంచి నదిలో దూకింది. గమనించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మహిళ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. బాధితురాలి బంధువుల ఫిర్యాదు మేరకు బూర్గంపాడు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చవిటిగూడెంలో కేజీ గంజాయి పట్టివేత


అశ్వాపురం, ఆగస్టు 5: మండల కేంద్రమైన అశ్వాపురం శివారు చవిటిగూడెంలో డ్యాగ్ స్క్వాడ్‌తో సోమవారం సీఐ అశోక్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. చవిటిగూడెం గ్రామానికి చెందిన పార్వతి అనేమహిళ గంజాయిని విక్రయించటానికి ఇంట్లో టిఫిన్‌బాక్స్‌లో దాచి ఉంచగా డాగ్ పసిగట్టింది. దీంతో పోలీసులు సదరు మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సోదాల్లో అశ్వాపురం ఎస్ఐలు తిరుపతిరావు, సురేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

కారేపల్లి, ఆగస్టు5: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గుంపెళ్లగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంపెళ్లగూడెం గ్రామానికి చెందిన ఎర్రబెల్లి సుధాకర్(44) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గుండెలో నొప్పి వస్తుందని చెప్పడంతో, కుటుంబ సభ్యులు అతడిని వెంటనే మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. అయితే అతడిని పరీక్షించిన వైద్య సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారి సురేష్ నిర్ధారించారు. కాగా సుధాకర్ గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు.

మైసమ్మ తల్లికి ఎమ్మెల్యే పూజలు

మణుగూరుటౌన్, ఆగస్టు 5: శ్రావణమాసం ప్రారంభమైన సందర్భంగా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని నేరెళ్ల చెరువు కట్టపై ముత్యాలమ్మ గుడిని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం సందర్శించి పూజలు చేశారు. అనంతరం గుడి ప్రహరీ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా నేరెళ్లచెరువు ఆయకట్టు రైతులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయి వినతిపత్రాన్ని అందజేశారు. రైతులు తెలిపిన సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. వర్షాలు పూర్తిస్థాయిలో తగ్గిన వెంటనే చెరువు పూడిక తీయించి సిల్ట్‌ను తొలగించేపనులు చేయిస్తానన్నారు. అదేవిధంగా రైతులకు ఇబ్బందులు లేకుండా సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తానని హామీనిచ్చారు. సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తాననడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
మంగళవారం 6 ఆగస్టు 2024

కలుషిత వాతావరణంతో విపత్కర పరిస్థితులు

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం, స్వచ్ఛదనంతోనే సమస్త మానవాళికి మెరుగైన మనుగడ సాధ్యమవుతుందని, కలుషిత వాతావరణంతోనే విపత్కర పరిస్థితులు, ప్రకృతి విపత్తులు ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పచ్చదనం - స్వచ్ఛదనం కార్యక్రమాన్ని లక్ష్మీదేవిపల్లి మండలం, శ్రీనగర్ కాలనీలో సోమవారం ఆయన ప్రారంభించారు. గ్రామంలో మొక్కలు నాటిన అనంతరం శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కలు నాటడం, పరిసరాలను పరిశుభ్రం చేయడం కేవలం ప్రభుత్వ కార్యక్రమంగానే భావించొద్దని, ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకుంటే పచ్చదనం, స్వచ్ఛదనం కల సాకారమవుతుందన్నారు. కొద్ది రోజులకు కార్యక్రమాన్ని పరిమితం చేయడం వల్ల ఆశించిన లక్ష్యాలకు చేరుకోలేమని, నిత్యప్రక్రియగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చలపతిరావు, ఎంపీవో శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈఈ వెంకటస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, ఎంపీటీసీ కోళ్ల పద్మ, మాజీ ఉపసర్పంచులు లగడపాటి రమేష్, చింత నాగమణి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


కొత్తగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని


ఇల్లెందులో నిర్వహించిన ర్యాలీ

ఇల్లెందులో..

ఇల్లెందు టౌన్, ఆగస్టు 5 : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం ఇల్లెందు పట్టణంలో భారీ ఎత్తున నిర్వహించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛదనం- పచ్చదనం చేపట్టారు. జగదాంబసెంటరులో ఈ ర్యాలీని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం మొక్కలను పెంచి పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఎంతోగానో కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం పని చేస్తుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ హరిచందన, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మేనేజరు అంకూషావలి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు కనగాల పేరయ్య, బడుగు సాంబమూర్తి, సుదర్శన్ కోరీ, డానియల్, శ్రీనివాస్ పాల్గొన్నారు. విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

'స్వచ్ఛదనం.. పచ్చదనం ప్రతీ ఒక్కరి బాధ్యత

కలెక్టర్ జితేష్ వి. పాటిల్


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

టేకులపల్లి, ఆగస్టు 5: స్వచ్ఛదనం-పచ్చదనం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఆయన సోమవారం టేకులపల్లిలో ప్రారంభించారు. టేకులపల్లి గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామ సభలో కలెక్టర్ మాట్లాడారు. టేకులపల్లిలో మండ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శానిటరీ నాపికిన్ తయారు కేంద్రన్ని ఆయన సందర్శించి వస్తువుల తయారిని పరిశీలించి మహిళా సభ్యులను అభినందించారు. రాంపురం పంచాయతీ పాతతండాలో రైతు బాదావతు హర్య(బిక్కులాల్)కు చెందిన చేలో మునగ సాగును కలెక్టర్ పరిశీలించారు. రైతులు మునగ సాగుకు ముందుకు రావాలని ప్రోత్సహించారు. రైతు చేలో కలెక్టర్ మునగ మొక్కలు నాటారు. అనంతరం సులానగర్ నర్సరీలో రైతుల కోసం ఈజీఎస్ ఆధ్వర్యంలో పంచుతున్న మునగ మొక్కలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో విద్యాచందన, తహసీల్దార్ నాగభవానీ, ఎంపీడీవో రవీందర్‌రావు, ఏవో అన్నపూర్ణ, ఎంపీవో లక్ష్మీగణేష్‌గాంధీ, ఏపీవో కాలంగి శ్రీనివాస్, ఏపీఎం రవికుమార్, టేకులపల్లి ఎస్సై సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపు లక్ష్యంగా..

కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం గ్రామాల్లో, పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంచడమేనని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం కొత్తగూడెంలోని రామవరం 6వ వార్డులో చేపట్టిన శ్రమదాన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలను నాటి, ప్రభుత్వ భూమిలో పిచ్చిమొక్కలను, చెత్తను అక్కడి ప్రజలు, అధికారులతో కలిసి తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూమిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించడానికి తగిన ప్రతిపాదనలు సమర్పించవల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శేషు, ఇరిగేషన్ ఈఈ అర్జున్‌రావు, కొత్తగూడెం సింగరేణి సివిల్ అసిస్టెంట్ జనరల్ మేనేజరు రామకృష్ణ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణ అందరి బాధ్యత

టేకులపల్లి: మాదక ద్రవ్యాల నియంత్రణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. టేకులపల్లి పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం టేకులపల్లిలో ఏర్పాటు చేసిన అవగాహణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాదక ద్రవ్యాల నియంత్రణ స్టిక్కర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల మత్తువీడి సమాజాన్ని కాపాడాలన్నారు. ఎవరైనా నిషేధిత గంజాయిని రవాణా చేసిన, సేవించిన పోలీసులకు సమాచారం అందించాలని ఆ పోస్టర్‌పై పేర్కొన్నారు.

'ఉపాధ్యాయులను వెంటనే నియమించాలి'


వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 5: మండల పరిధిలోని శ్రీనగర్ గ్రామపంచాయతీ ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చి విద్యార్థులకు సరైన విద్యాబోధనను అందించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విద్యాశాఖాధికారులను ఆదేశించారు. సోమవారం శ్రీనగర్ గ్రామపంచాయతీలో ఎమ్మెల్యేకు శ్రీనగర్ మాజీ ఉపసర్పంచ్ లగడపాటి రమేష్‌చంద్‌తోపాటు స్థానికులు వినతిపత్రం అందజేశారు.

గ్రామపంచాయతీలు.. స్థానిక ప్రభుత్వాలు

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి, ఆగస్టు 5: గ్రామ పంచాయతీలంటే స్థానిక ప్రభుత్వాలు అని, ప్రజా ప్రతినిధులకు నిధులు కేటాయిస్తే అత్యవసర, విపత్కకర పరిస్థితుల్లో ప్రజల సమస్యలు పరిష్కరించబడతాయని, అభివృద్ధికి పంచాయతీలు పట్టుకొమ్మలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం చుంచుపల్లి మండల ప్రజా పరిషత్ పదవీ విరమణ ఆత్మీయ వీడ్కోలుసన్మానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ఐదేళ్ల కాలంలో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. ప్రజలకు సేవ చేసే ఆలోచన ఉన్నప్పుడే ప్రజా క్షేత్రంలోనికి రావాలని, అడుగు వేస్తే సేవ చేసుకుంటూ పోవాలి తప్ప ఆగిపోకూడదని సూచించారు. చుంచుపల్లి మండలం తనకు ఎంతో ప్రత్యేకమైనదని, ఇక్కడ ఉన్న వనరులు, వసతులు, నాయకులు, సమస్యలు తనకు తెలుసునని పేర్కొన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని ఆటంకాలు వచ్చినా ప్రజలకు వాగ్దానాల ప్రకారం సేవ చేసిన ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పదవీ విరమణ పొందిన జడ్పీటీసీ కంచర్ల చంద్రశేఖర్‌రావు మాట్లాడారు. అనంతరం ఎంపీటీసీ, జడ్పీటీసీలను సన్మానించి జ్ఞాపికలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాదావత్ శాంతి, ఎంపీడీవో అశోక్‌కుమార్, తహసీల్దార్ కృష్ణ, ఎంపీవో గుంటి సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని సత్కరించిన అధికారులు


అనిత్యా జ్యోతిని సత్కరిస్తున్న అధికారులు

దమ్మపేట, ఆగస్టు 5: వెంకటాద్రిగూడెం పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతూ కరీంనగర్‌లోని క్రీడాపాఠశాలకు ఎంపికైన అనితాజ్యోతిని అధికారులు, గ్రామస్తులు సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతు చిన్నతనం నుంచే క్రీడలపై ప్రతిభ కనబరుస్తూ అనితాజ్యోతి క్రీడాపాఠశాలకు ఎంపికవటం పట్ల అభినందించారు. చదువుతో పాటు క్రీడలలో జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చేవిధంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంఈవో లక్ష్మి, స్కూల్ కాంపెక్సు హెచ్‌ఎం సత్యసాగర్, పాఠశాల హెచ్‌ఎం కృష్ణమోహన్ పాల్గొన్నారు.

జామాయిల్ ధర చెల్లింపులో వ్యత్యాసం


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

దుమ్ముగూడెం, ఆగస్టు 5: దుమ్ముగూడెం, చర్ల, భద్రాచలం మండలాల జామాయిల్ రైతులకు ధర చెల్లింపులో ఐటీసీ సంస్థ వివక్ష చూపుతోందని ఎంపీపీ రేసు లక్ష్మి అన్నారు. సీతారాంపురంలో సోమవారం జరిగిన బీఆర్‌ఎస్ అనుబంధ రైతు కమిటీ సమావేశంలో మాట్లాడారు. బూర్గంపాడు, ములకలపల్లి, అశ్వాపురం మండల రైతులకు టన్నుకు రూ.8వేలు చెల్లిస్తూ దుమ్ముగూడెం పరిసర మండలాల వారికి రూ.7500లు మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. అన్ని ప్రాంతాల రైతులకు ఒకే ధర చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: పాయం

అశ్వాపురం, ఆగస్టు 5: ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, రైతు రుణమాఫీ ఇందుకు నిదర్శనమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం మండలంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే మండల పరిధిలోని కల్యాణపురం, మిట్టగూడెం, పాములపల్లి, అమ్మగారిపల్లి, జగ్గారం, అశ్వాపురం,మొండికుంట గ్రామపంచాయతీల్లో రూ.60లక్షల విలువైన సీసీ రహదారులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హమీ మేరకు ఆరునెలల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు. సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు.పినపాక నియోజక వర్గాన్ని ఆదర్శనియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, ఏవైనా సమస్యలుంటే ప్రజలు తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, జడ్పీకోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్, తహశీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో వరప్రసాద్, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ చక్రధారి, మొండికుంట, మల్లెలమడుగు, నెల్లిపాక, గొల్లగూడెం ఎంపీటీసీలు కమటం నరేష్, బేతంరామకృష్ణ, గాదె జయ, ఏనిక రవి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, పలువురు కాంగ్రెస్‌నాయకులు, అధికారులు పాల్గొన్నారు. అశ్వాపురం రైతు వేదికలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.


సీసీ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

స్వచ్ఛదనం - పచ్ఛదనం పరిశీలన

చుంచుపల్లి, ఆగస్టు 5: స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని డీపీవో చంద్రమౌళి సోమవారం పరిశీలించారు. ఈ క్రమంలో చుంచుపల్లి మండలంలోని రుద్రంపూర్ పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీలో ఉన్న నర్సరీలను, ఎవెన్యూ ప్లాంటేషన్‌లను, పంచాయతీ పరిసరాలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా ఈ నెల 9వ తేదీ వరకు నిర్వహించాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేందర్, ఎంపీవో గుంటి సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఐదేళ్ల పాలన సంతృప్తినిచ్చింది'



ఆళ్లపల్లి, ఆగస్టు 5: నూతనంగా ఏర్పాటైన ఆళ్లపల్లి మండలానికి ఎంపీపీ, జడ్పీటీసీలుగా పదవి బాధ్యతలు చేపట్టి ఈ ఐదేళ్లలో ఎంపీటీసీలు, అధికారులతో కలిసి ప్రజలకు సేవ చేశాం అన్న సంతృప్తి కలిగిందని ఆళ్లపల్లి ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి జడ్పీటీసీ హనుమంతరావు అన్నారు. మంగళవారం మండల పరిషత్ ప్రజాప్రతినిధులకు పదవికాలం ముగియడంతో సోమవారం ఆళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన ప్రజాప్రతినిధులకు, అధికారులకు, కార్యదర్శులకు సన్మాన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీ సీఈవో చంద్రశేఖర్ పాల్గొనగా, వైస్‌ఎంపీపీ రేసు ఎల్లయ్య, కో ఆప్షన్ సభ్యులు రహీం, రాఘవాపూరం ఎంపీటీసీ సత్యవతి, ఎంపీవో శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, వివిధ శాఖ అధికారులు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'ఉద్యమకారులను సమరయోధులుగా గుర్తించాలి'

కొత్తగూడెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను రేకెత్తించి 1969 ఉద్యమకారులను తెలంగాణ సమరయోధులుగా గుర్తించి వారిని అన్ని విధాలా ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో ఆగస్టు 5న జరిగిన పోలీసుల కాల్పుల్లో మృతి చెందిన కె.రాంచందర్, ఎండీ దస్తగిరిలకు సంతాప సభ సందర్భంగా సోమవారం బస్టాండ్‌సెంటరులోని అమరవీరుల స్థూపం వద్ద ఉద్యమకారులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాపసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వివక్షతకు గురవుతున్న తెలంగాణలో 1969లో జరిగిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమమే 2009లో తారాస్థాయిలో ప్రారంభమైన ఉద్యమానికి స్ఫూర్తి అని అన్నారు. నాడు ఉద్యమం లేకుంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడేది కాదన్నారు. తెలంగాణ ఉద్యమానికి బీజం పోసిన నాటి ఉద్యమకారులని తెలంగాణ సమరయోధులుగా గుర్తించి పెన్షన్, గృహవసతి, రైతులకు అందించి ఆదుకోవాలని కోరారు. ఉద్యమకారులు ఆశీర్వాదం, రామకృష్ణమూర్తి, కోట్లేటి రాందాస్ తదితరుల విగ్రహ ప్రతిష్ఠకు స్థలం కేటాయించేందుకు అధికారులకు సిఫార్సు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కూనంనేని

షెడ్యూల్ ప్రకారం పనులను చేపట్టాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్


సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

జూలూరుపాడు, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం చేపట్టాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ సూచించారు. సోమవారం ఆయన మండలంలోని జూలూరుపాడు, పాపకొల్లు పంచాయతీలను ఆకస్మికంగా సందర్శించారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమ అమలు తీరును, పారిశుద్య పనులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు కార్యక్రమాలను చేపట్టాలని, గ్రామాలలో చెత్త కుప్పలు, మురికి నీటి గుంటలు, పిచ్చి మొక్కలను తొలిగించడంతో పాటు, ట్యాంకులను శుభ్రం చేయాలని అన్నారు. పనులను చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపివో తులశీరాం, పంచాయతీ కార్యదర్శులు హరిబాబు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట పంచాయతీ కార్యదర్శిగా శ్రీరామ్‌మూర్తి

అశ్వారావుపేట, ఆగస్టు 5: అశ్వారావుపేట మేజర్ పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా కోటమర్తి శ్రీరామ్ మూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. దమ్మపేట మండలం సీతారాంపురం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తుండగా కలెక్టర్ ఆదేశాలమేరకు అశ్వారావుపేట పంచాయతీ ఇంచార్జీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు కార్యదర్శిగా పని చేసిన హరికృష్ణ కొద్దిరోజుల క్రితం బదిలీపై వెళ్ళగా మేజర్ పంచాయతీ కార్యదర్శి స్థానం ఇప్పటి వరకు ఖాళీగా ఉంది. శ్రీరామ్‌మూర్తి బాధ్యతలు స్వీకరించారు.

గంజాయి రహిత సమాజం నిర్మిద్దాం: సీఐ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 5: గంజాయి రహిత సమాజాన్ని ప్రతి ఒక్కరు బాధ్యత వహించి నిర్మిద్దామని కొత్తగూడెం త్రీటౌన్ సీఐ శివప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో స్టేషన్ మాస్టర్ ఆర్‌కె. మీనాతో కలిసి గంజాయి నిషేధిత పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా గంజాయిని సేవిస్తున్న, రవాణా చేస్తున్న, నిల్వ ఉంచినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఏదైనా గంజాయికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలన్నారు. అదేవిధంగా రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణ ఆవరణలో ప్యాసింజర్ ఆటోల వెనుక గంజాయి నిషేధిత పోస్టర్లను కొత్తగూడెం టూటౌన్ సీఐ రమేష్ అతికించారు. ఈ సందర్భంగా టూటౌన్ సీఐ మాట్లాడుతూ గంజాయిని సరఫరా చేస్తే అటువంటి సమాచారం పోలీసులకు అందించాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. ప్రతి ఒక్కరు ప్రయాణికుల గమ్య స్థానాలను సురక్షితంగా చేర్చేలా పని చేయాలన్నారు.

'ప్రజాప్రతినిధులను ప్రజలు మరువరు'

పాల్వంచ రూరల్, ఆగస్టు 5 : పదవీ కాలంలో నిస్వార్థంగా పని చేసిన ప్రజాప్రతినిధులను ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయం వద్ద ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం పూర్తికావడంతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదేళ్లపాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పని చేసిన ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధే లక్ష్యంగా పని చేశారని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో జడ్పీ చైర్మన్‌గా పని చేసిన వాసుదేవరావును, ఎంపీపీ మడవి సరస్వతిని ఘనంగా సన్మానించారు.

నాగరికత పంటలపై మొగ్గుచూపండి: సీఈవో

ఆళ్లపల్లి, ఆగస్టు 5: నాగరికత పంటలైన మొక్కజొన్న, రాగులు, సజ్జలు ఇతర వంగడాలను ఉత్పత్తి చేసేందుకు రైతులు మొగ్గ చూపాలని జడ్పీ సీఈవో చంద్రశేఖర్ మర్కోడు గ్రామంలో రైతులకు సూచించారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆయన మొదటి రోజు మర్కోడు గ్రామంలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామ సభలో మాట్లాడుతూ.. ఇంటి పెరటిలో కూరగాయలు పండించుకుంటే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని దోమలను నివారిస్తే రోగాలను దూరం పెట్టవచ్చని ఆయన సూచించారు.

తడిపొడి చెత్త సేకరణలో ముందుండాలి: కనకయ్య

ఇల్లెందు టౌన్, ఆగస్టు 5: ఇల్లెందు మున్సిపాలిటిలో తడిపొడి చెత్తసేకరణలో ముందుండి రాష్ట్రస్థాయిలో మరో పర్యాయం అవార్డు సాధించాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. సోమవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఆర్‌సీ భవనాన్ని పరిశీలించారు. డీఆర్‌సీ సెంటరులో తడిపొడి చెత్తసేకరణ చేసిన అనంతరం వర్మీకంపోస్టు తయారు చేయడం నిలిచిపోవడంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌సీ కేంద్రంలో మొక్కలు నాటాలని, వర్మీకంపోస్టు తయారీని ప్రారంభించేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ షాహిద్ మసూద్, కమిషనర్ యాదగిరి, మేనేజరు అంకుషావళి, ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


డీఆర్‌సీ భవనాన్ని పరిశీలిస్తున్న కనకయ్య

పాలక వర్గానికి ఘనంగా సన్మానం

జూలూరుపాడు, ఆగస్టు 5: మండల ప్రజా పరిషత్ పాలక వర్గం సభ్యుల పదవీ కాలం ముగియడంతో ప్రజా ప్రతినిధులకు ఘనంగా సన్మానం చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాలక వర్గ పదవి విరమణను పురస్కరించుకొని ఆత్మీయ సన్మానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లావుడ్యా సోనీ, జడ్పీటీసీ భూక్యా కళావతితో పాటు, ఎంపీటీసీలకు శాలువలు కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారు. ఐదేళ్ల కాలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించారని, రానున్న రోజుల్లో ప్రజా సేవలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, లాకావత్ గిరిబాబు, కృష్ణమూర్తి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్, వైస్ ఎంపీపీ గాదె నిర్మల పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మణుగూరుటౌన్, ఆగస్టు 5: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న వృత్తి విద్యా శిక్షణతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని మణుగూరు ఏరియా సేవా అధ్యక్షురాలు దుర్గం సుమతి అన్నారు. సోమవారం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి విద్యలో శిక్షణ పొందిన ఐదు బ్యాచ్‌లకు చెందిన 69 మంది మహిళలకు హైదరాబాద్‌కు చెందిన ఖాదీ గ్రామోద్యోగ ఆధ్వర్యంలో పీవీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో రాత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 2002 సంవత్సరం నుంచి సింగరేణి కుటుంబ మహిళలతోపాటు సరిసర ప్రాంత మహిళల ఆర్థిక సాధికారతకు ఉపయోగపడేలా సింగరేణి సంస్థ వృత్తి విద్యా కోర్సుల్లో ఉచితంగా శిక్షణనిస్తోందన్నారు.